ప్రజాశక్తి

సోమవారం 28 జులై 2025

5

విజయనగరం

నేడు పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతోపాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చని సూచించారు. meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కాల్ సెంటర్ నంబర్ 1100కు కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చని చెప్పారు.

అంబులెన్స్ మాఫియా

ఆస్పత్రి ఎదుట ఉన్న ప్రయివేటు అంబులెన్సులు

మాఫియా

ఈ పేరు వింటేనే ఏదో తెలియని భయం. సిండి'కేటుగాళ్లు' అంతా ముఠాగా ఏర్పడి భయపెట్టి, దందాను కొనసాగించడమే అందుకు కారణం. సాధారణంగా మద్యం మాఫియా, గంజాయి మాఫియా, ఇసుక మాఫియా.. ఇలాంటి పేర్లు మన ప్రాంతంలో తరచూ వింటుంటాం. కొత్తగా అంబులెన్స్ మాఫియా వేళ్లూనుకొంది. వినడానికి వింతగా ఉన్నా నమ్మాల్సిందే మరీ! అదీనూ ఎక్కడో కాదు. విజయనగరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎదుటే ఈ మాఫియా పురుడుపోసుకొంది. ప్రభుత్వ వ్యవస్థలో లొసుగుల్ని ఉపయోగించుకుని, రోగుల అత్యవసర పరిస్థితిని ఆసరా చేసుకుని దందాను సాగిస్తోంది.

- రోగుల బంధువులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రయివేటు అంబులెన్సుల యజమానులు
- సిండికేట్‌గా ఏర్పడి అధిక ఛార్జీలు వసూలు
- దందాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ సిబ్బందే కీలకం?
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బయట ప్రయివేటు అంబులెన్సులు నడిపే వ్యక్తులు.. రోగుల బంధువులను దోపిడీ చేస్తున్నారు. నగరంలో ఎన్నడూ లేనంతలా అంబులెన్స్ ఫీజులు వసూలు చేస్తూ దందాకు పాల్పడుతున్నారు. దీనికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది, వార్డు బాయ్‌లే ప్రధాన సూత్రధారులుగా చెబుతున్నారు. ఈ వ్యవహారం ఏళ్ల తరబడి నడుస్తున్నా, ఏడాది క్రితం సిండికేట్‌గా ఏర్పడి.. మాఫియాగా మారి లూటీ చేస్తున్నారు. మధ్యలో వచ్చిన అధికారులు అడ్డుకట్ట వేసినప్పటికీ ఈ దోపిడీని నిరోధించలేకపోతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా షరామాములే అన్న చందంగానూ కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారు.

విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బయట అనేక ప్రయివేటు అంబులెన్సులు కనిపిస్తూ ఉంటాయి. ఆస్పత్రి నుంచి రోగిని రిఫర్ చేయాలన్నా, మృతి చెందిన వ్యక్తిని తరలించాలన్నా ప్రయివేటు అంబులెన్సులను ఆశ్రయిస్తున్నారు. ఆస్పత్రిలో పనిచేసే వార్డు బాయ్‌లు ప్రయివేటు అంబులెన్స్ నడిపే వ్యక్తులతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. అందుకు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా సహకరిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆస్పత్రిలో నుంచి ఎవరినైనా రిఫర్ చేయాలంటే ఈ ఆస్పత్రిలో పనిచేసే వార్డ్ బాయ్ నేరుగా అంబులెన్సులు నడిపే వ్యక్తికి కాల్ చేసి రప్పిస్తారు. రప్పించిన వెంటనే ఛార్జీ అధిక మొత్తంలో వసూలయ్యే విధంగా ఈయనే మాట్లాడతాడు. ఇందులో వార్డు బాయ్‌కి 30 శాతం కమీషన్ రూపంలో అందుతుంది. ఒప్పందం కుదిరిన వెంటనే ప్రయివేటు అంబులెన్స్‌లు నడిపే వ్యక్తులు డబ్బులను ఫోన్ పేలో జమ చేస్తుంటారు. రూ.3 వేలకు ప్రయివేటు అంబులెన్స్ బేరం కుదిరితే అవుట్ సోర్సింగ్ సిబ్బంది, వార్డు బాయ్‌లకు కమీషన్‌గా రూ.900ను ప్రయివేటు అంబులెన్సులు నడిపే వ్యక్తులు అందిస్తారు.

సిండికేటుగా మారి..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బయట ఉన్న ప్రయివేటు అంబులెన్సుల యజమానులు కొంతమంది సిండికేటుగా ఏర్పడ్డారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో ఎవరిని రిఫర్ చేసినా, చనిపోయిన కేసులు తీసుకెళ్లాలన్నా వారినే ఆశ్రయించాల్సిన పరిస్థితి కల్పించారు. వారు అడిగినంత మొత్తాన్ని బాధితులు ఇవ్వాల్సిందే. బయట నుంచి బాధితులు అంబులెన్స్ తెచ్చుకున్నా వీరు లోపలికి రానివ్వడం లేదు. అందుకోసం ఆస్పత్రి గేటు వద్ద ఒక వ్యక్తిని కాపలా పెడుతున్నారు. బయట అంబులెన్స్ అయితే రిఫర్ కేసుకు విశాఖపట్నం వెళ్లేందుకు రూ.2 వేల నుంచి రూ.2500 వసూల్ చేస్తే, సిండికేటుగా ఏర్పడిన వ్యక్తులు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. వీరి నిలువు దోపిడీని అటు ఆసుపత్రి అధికారులు, ఇటు పోలీసు, ఆర్‌టిఒ అధికారులు అరికట్టాలని బాధితులు కోరుతున్నారు.

వారికి సంబంధముంటే చర్యలు తప్పవు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సిబ్బంది ప్రయివేటు అంబులెన్సులతో మాట్లాడి బేరాలు కుదిరిస్తే చర్యలు తప్పవు. ఆస్పత్రి బయట ఉన్న ప్రయివేటు అంబులెన్సులకు, ఆస్పత్రిలో పని చేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది, వార్డు బాయ్‌లకు సంబంధం ఉంటే విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రి బయట ఉన్న ప్రయివేటు అంబులెన్సులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు, ఆర్‌టిఒ అధికారుల సహకారంతో రెండు సార్లు లేకుండా చేశాం.

- ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, విజయనగరం

ఆండ్ర నీరు విడుదల



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని ఆండ్ర రిజర్వాయరు నీటిని ఆదివారం మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు శాఖ మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధికి, సాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతులకు, అభివృద్ధి పనులకు రెండున్నర కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఆండ్ర జలాశయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర రైతుల భద్రత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి ఎకరానికీ నీరు చేరేలా అధికార యంత్రాంగం సమర్థంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

29న ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు రాక

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 29న ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు జిల్లాలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక రెవెన్యూ హోంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎపిజెఎసి అమరావతి జిల్లా సమావేశాన్ని ఆయన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాలోని తహశీల్దార్లు, రెవెన్యూ కార్యవర్గ సభ్యులతో నిర్వహించే సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో తహశీల్దార్లు, జిల్లా, డివిజన్ కార్యవర్గ సభ్యులంతా మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి హాజరవ్వాలని ఆ అసోసియేషన్ ఒక ప్రకటనలో కోరింది.

రైతు బజారును పరిశీలిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు

పోరాట ఫలితంగా రైతుబజారు ఏర్పాటు

పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మహారాజా ఆసుపత్రి రైతు బజారు ఎత్తి వేసిన సందర్భంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఎనిమిది రోజుల పాటు చేసిన పోరాట ఫలితంగా రింగ్‌రోడ్డు రైతుబజారు వద్ద షాపులు వేసి రైతులకు అప్పగించారు. తాత్కాలికంగా రింగ్‌రోడ్డు వద్ద టెంట్లు వేసి ఇస్తామన్నా అధికారుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేసి, శాశ్వతంగా షెడ్లు ఏర్పాటు చేయాలని పిపిఎస్ఎస్ ఆధ్వర్యాన పోరాటం కొనసాగించారు. దీంతో ఆదివారం దాసన్నపేట రైతుబజారులో షెడ్లు కేటాయించి రైతులకు అప్పగించారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేసిన రైతుబజారును పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు సందర్శించి, రైతులతో మాట్లాడారు. పోరాట ఫలితంగానే షాపులు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. ప్రస్తుతం వ్యాపారాలు జరగటం లేదని, తక్షణమే శాశ్వత రైతుబజారు పాత టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అంత వరకు రైతుల నుంచి నెలవారి అద్దెలు రద్దు చెయ్యాలన్నారు. మొత్తం 46 మందికి కేవలం 16 మందికి మాత్రమే షెడ్లు ఇచ్చారని, మిగతా 30 మందికి షెడ్లు వేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, ఎడి నాగభూషణం, ఎఒ నీలిమ తనిఖీలు చేపట్టారు. యూరియా, ఇతర ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నారన్న ఫిర్యాదు మేరకు ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశాలతో వారు ఆదివారం తనిఖీలు చేపట్టారు. రిటైల్, హోల్‌సేల్ ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఎరువుల భౌతిక నిల్వలు, కంపెనీ ఇన్‌వాయిస్‌లు, గోడౌన్లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వివిధ రకాల 21.55 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపేశారు. వీటి విలువ రూ.3,74,588 గా నిర్ధారించారు. ఎంఆర్‌పి కంటే అధికంగా విక్రయిస్తే జిల్లా కంట్రోల్ రూం నెంబర్ 8331056279కు ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి రామారావు సూచించారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

సమతా సదస్సులో ప్రొఫెసర్ పద్మ

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పద్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ప్రొఫెసర్ డాక్టర్ పద్మ అన్నారు. జన విజ్ఞాన వేదిక సమతా విభాగం ఆధ్వర్యంలో సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర – శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. 2008 తర్వాత ఉపాధి అవకాశాలు, ఉద్యోగాల భర్తీ సంఖ్య తగ్గిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక, బతకడం కోసం పని గంటలతో సంబంధం లేకుండా ప్రయివేటు సంస్థల్లో పని చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వాలు వ్యయాలను కుదించడం వల్ల మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. అభద్రతా భావంతో కూడిన పనులు ఎక్కువ గంటలు చేయాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వ విధానాలు మహిళలకు అనుకూలంగా లేకపోవడం వల్ల అసమానతలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు 67 శాతం మంది చదువుతుంటే, పురుషులు 74 శాతం మంది చదువుతున్నారన్నారు. పురుషులకు రూ.100 వేతనం వస్తే, మహిళలకు రూ.73 మాత్రమే వస్తోందని చెప్పారు. విద్య, ఆరోగ్య విషయాల్లో వ్యత్యాసం ఉందన్నారు. గిరిజనుల్లో మాతృ మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని చెప్పారు. మహిళకు ప్రజాస్వామ్యం అనేది లేదన్నారు. ఇన్ని ఆటంకాలు ఉన్న మహిళలు లేనిదే సమాజాభివృద్ధి లేదన్నది వాస్తవమన్నారు. మూఢనమ్మకాలు వల్ల మహిళలు వంటిల్లు కుందేళ్లుగా ఉండాల్సిన పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతూనే ఉందన్నారు. ఈ ఆటంకాలను అధిగమించేందుకు ప్రశ్నించే గుణం రావాలని, అప్పుడే మార్పు సాధ్యమని స్పష్టంచేశారు. ఆ దిశగా మహిళా లోకం నడవాలని, శాస్త్రీయ ఆలోచన విధానం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో జెవివి ప్రతినిధులు శశికళ, కుసుమ కుమారి, జగదంబ, చీకటి దివాకర్, మహిళలు పాల్గొన్నారు.

వైద్యుల సమ్మేళనంలో వి.ఎస్.ప్రసాద్

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విఎస్ ప్రసాద్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నంద్యాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యుల సమ్మేళనంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సి.జి.పి హెడ్‌క్వార్టర్ డీన్ డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు. 'సురక్షిత వైద్య సాధన'పై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్, ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీహరిరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు నందకిశోర్, కిశోర్, అశోక్, త్యాగరాజ రెడ్డి, ఐఎంఎ రాష్ట్ర కార్యదర్శి బాలమద్దయ్య, సహ కార్యదర్శి సేవాకుమార్ హాజరయ్యారు.

ఎన్‌సిసి కేడెట్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం కళాశాలకు చెందిన ఎన్‌సిసి కేడెట్ ఎ.శివశంకర్ వరప్రసాద్‌కి ఎన్‌సిసి డైరెక్టరేట్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) నుండి ప్రశంసాపత్రం లభించింది. ఇటీవల అనంతపురంలో నిర్వహించిన ఇంటర్ గ్రూప్ కాంపిటేషన్ (ఐజిసి) – థల్ సైనిక్ క్యాంప్ (టిఎస్‌సి)లో పాల్గొన్న శివశంకర్ ప్రతిభ కనబరచడంతో ఈ గుర్తింపు లభించింది. దీంతో ఆదివారం సీతం విద్యాసంస్థల సెక్రటరీ బొత్స ఝాన్సీలక్ష్మి, సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు... శివశంకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.వి.రామమూర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

సబ్‌జైల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి సబ్ జైలును ఆదివారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని, తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని సూచించారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. జైలులో అమలవుతున్న సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. నిత్యావసర వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

11 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

దత్తిరాజేరు మండలం పెదమానాపురం పోలీసు స్టేషను పరిధిలోని సంత శివార్లలో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న వారిపై ఆదివారం పోలీసులు డ్రోన్ల సహాయంతో దాడులు చేపట్టారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 11 మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై ఆకస్మికంగా దాడులు చేపట్టేందుకు డ్రోన్లను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. అందులో భాగంగానే మానాపురం సంత శివార్లలో డ్రోన్లతో నిఘా ఏర్పాటుచేసి, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న 11మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిపై పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి కేసులు నమోదు చేశారని వివరించారు.

ముగిసిన ఐఎస్‌సిపి సదస్సు

నాలుగు రాష్ట్రాల నుంచి హాజరైన వైద్య నిపుణులు

సదస్సులో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని తిరుమల–మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ కోలో ప్రోక్టాలజీ సదస్సు ఆదివారం ముగిసింది. రెండు రోజులపాటు జరిగిన సదస్సులో నాలుగు రాష్ట్రాల నుంచి 150 మంది వైద్యులు, 20 మంది ఫ్యాకల్టీ పాల్గొన్నారు. శనివారం మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సదస్సుకు తిరుమల మెడికవర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ అధ్యక్షత వహించారు. మొదటి రోజు లైవ్ సర్జరీ డెమోన్‌స్ట్రేషన్ ఫెలోషిప్ కోర్స్‌పై శిక్షణ ఇచ్చారు. రెండో రోజు ఆదివారం అడ్వాన్స్‌డ్ శస్త్ర చికిత్సలపై అవగాహన కల్పించారు.

ప్రధానంగా పైల్స్, ఫిస్టులా, ఫిషర్, పిలో నిడల్ సినస్ వ్యాధులకు అత్యాధునిక లేజర్ ట్రీట్మెంట్ విధానంపై శిక్షణ అందించారు. శిక్షణ పొందిన వైద్యులకు ఆర్గనైజింగ్ చైర్మన్ తిరుమల ప్రసాద్ మెమోంటోలను అందించారు. ఈ సందర్భంగా తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత ఆరేళ్లుగా జరగని మొట్టమొదటి శిక్షణ కార్యక్రమం విజయనగరంలో నిర్వహించినట్లు తెలిపారు. ఆరేళ్ల క్రితం కరీంనగర్‌లో ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ కోలో ప్రోక్టాలజీ అధ్యక్షులు ప్రశాంత్ రహలే, కార్యదర్శి ఎల్‌డి లడుకర్, కోశాధికారి శాంతి వర్ధిని, తిరుమల –మెడికవర్ డైరెక్టర్ కె.కృష్ణశాంతి పాల్గొన్నారు.

రాధికారాణికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరానికి చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి, నర్తనశాల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణికి జాతీయ పురస్కారం లభించింది. నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ ప్రతి ఏటా ఇచ్చే జాతీయ పురస్కాల్లో భాగంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో శనివారం రాత్రి కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి, మల్కాజ్‌గిరి కోర్టు న్యాయమూర్తి మధుసూదన్ రావు ఆమెకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. నాట్య రంగానికి సుమారు మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. రాధికా రాణికి పురస్కారం లభించడం పట్ల విజయనగరానికి చెందిన పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఆశాజనకంగా ఖరీఫ్

- ఎరువుల కోసం ఆందోళన వద్దు
- గతం కంటే అధిక శాతం వర్షపాతం నమోదు
- నానో యూరియా, డిఎపి అందుబాటులోకి..
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరంకోట



గతంతో పోలిస్తే ఈ ఏడాది ఖరీఫ్ ముందుగానే ప్రారంభమైందని, ఆశాజనకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు అన్నారు. ఈ నెల 25 నాటికి జిల్లాలో 80,937 ఎకరాల్లో వివిధ పంటలు సాగవ్వగా, వరి 38,237 ఎకరాల్లో సాగైందని తెలిపారు. మే నెలలోనే వర్షాలు రావడంతో వరి ఆకులు, ఎదలు వేశారని చెప్పారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో ఖరీఫ్‌కు సంబంధించి పలు విషయాలు వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

ఖరీఫ్ సీజన్లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి.?

జిల్లాలో ఖరీఫ్ సీజన్లో సాధారణంగా 2,92,482 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయి. ఇందులో ప్రస్తుతానికి 80,812 ఎకరాల్లో సాగయ్యాయి. వరి 38,237 ఎకరాలు, మొక్కజొన్న 22,952 ఎకరాలు, పత్తి 4047 ఎకరాలు, చెరకు 5632 ఎకరాల్లో సాగయ్యాయి.

ఈ ఏడాది ఖరీఫ్ పరిస్థితి ఏమిటి? ఏ విధంగా సన్నద్ధమవుతున్నారు.?

గత ఏడాది కంటే ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో వర్షాలు ఎక్కువగా నమోదయ్యాయి. రైతులు వరి, మొక్కజొన్న పంటలను ముందుగా వేస్తున్నారు. ఈసారి వరి ఆకు కంటే ఎదలు వేయడానికి ఉత్సాహం చూపించారు. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ.5 వేల వరకు ఖర్చు తగ్గుతుంది, ఒకటి నుంచి రెండు బస్తాల వరకు ధాన్యం పెరుగుతాయి. దీంతో ఒక వారం ముందే వరి కోత మొదలయ్యే అవకాశం ఉంది.

విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయా .?

వరి విత్తనాలను ఇప్పటికే రైతు సేవా కేంద్రాలకు పంపించాం. ఎరువులు కూడా అందుకు తగ్గట్టుగానే.., యూరియా 20,629 మెట్రిక్ టన్నులు, డిఎపి 6,872 మెట్రిక్ టన్నులు అందుబాటులోకి వచ్చాయి. నూతన టెక్నాలజీతో నానో టెక్నాలజీ యూరియా, డిఎపి బాటిళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి ఒక 500 ఎంఎల్ బాటిల్‌కు 100 లీటర్ల నీటిని కలుపుకొని పిచికారి చేస్తే సరిపోతుంది. నానో టెక్నాలజీ యూరియా 500 ఎంఎల్ బాటిల్ ధర 600 రూపాయలు కాగా, డిఎపి 500 ఎంఎల్ ధర 600 రూపాయలు. ఇవన్నీ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

ప్రయివేట్ ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు యూరియా, డిఎపి విక్రయిస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ప్రయివేటు ఎరువులు దుకాణాల్లో ఎంఆర్‌పిని మించి అమ్మకాలు జరిపితే సంబంధిత వ్యవసాయ అధికారులకు ఫిర్యాదుచేయాలి. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు.

ఈ ఏడాది రైతులు వరి ఆకు వేయడం కంటే ఎద చల్లడానికి కారణమేమిటి.?

గత సంవత్సరం కంటే వర్షాలు ముందుగా రావడంతో రైతులు వరి విత్తనాలను చల్లడానికి ముందుకు వచ్చారు. ఖర్చులు తగ్గించుకునేందుకు ఎద సాగుకు మొగ్గుచూపారు.

సహకార రంగానికి పునరుజ్జీవం : మంత్రి

ప్రజాశక్తి- మెంటాడ

కూటమి ప్రభుత్వం సహకార రంగం పునరుజ్జీవానికి కట్టుబడి ఉందని మంత్రి సంధ్యారాణి అన్నారు. ఆదివారం మెంటాడ, జక్కువ పిఎసిఎస్ అధ్యక్షులు జి.మునిలినాయుడు, అర్నిపల్లి సత్యంతోపాటు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం కోపరేటివ్ సెక్టార్‌ను నాశనం చేసిందని విమర్శించారు. సొసైటీలకు పాలకవర్గాలను నియమించకుండా అధికారులతోనే నడిపించిందని అన్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కొత్త పాలకవర్గాలు రైతుల అభ్యున్నతికి పాటుపడుతూ సొసైటీలను అభివృద్ధి పథంలో నిలపాలని సూచించారు. అనంతరం జక్కువలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. ఆదివారం 7వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.2కోట్లతో రోడ్లు, కాలువలు నిర్మించనున్నామన్నారు. నగర పంచాయతీ వాసులకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు అన్ని దశల్లో సమగ్రవంతంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ టి. జయరాం, 7వవార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, జనసేన నాయకులు చనమల్ల వెంకటరమణ, ఎంఎం నాయుడు, పాండ్రంకి సత్యనారాయణ, మజ్జి రాంబాబు, బంగారు భాను ప్రకాష్, రవ్వా నాని, గంటా సతీష్, రవికుమార్ అడపాక చిన్న తదితరులు పాల్గొన్నారు.

బంకురువలసలో సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని బంకురువలస గ్రామంలో ఎమ్మెల్యే బేబీ నాయన, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, అల్లు కిషోర్, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులు, కెఎస్ఎస్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లంకిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో ఉప సర్పంచ్ పల్లె ధనుంజయ పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో ఆదివారం సీసీ రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికలు, చెత్తను కూలీల ద్వారా తొలగించారు. ఆ చెత్తను బండిపై ఎరువుపల్లి సెంటర్‌కు తరలించారు. అనంతరం గ్రామంలో ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి ఈగలు దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లించారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ భూముల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం దారుణమని జైభీం భారత్ పార్టీ నాయకులు కనిగిరి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గుషిణిలో ప్రభుత్వ భూముల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. గుషిని రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 65/15లో గల 1.75 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని రెవెన్యూ శాఖ సర్వే చేసి హెచ్చరిక బోర్డులు పెట్టినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ ఎన్ క్రోచ్ మెంట్ యాక్ట్ 1905 ప్రకారం, వాల్టా చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో రెండు వ్యవసాయ బోర్లు తవ్వి అక్రమంగా విద్యుత్ కనెక్షన్లులు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యుత్ కనెక్షన్లలో అక్రమంగా రాయితీ ఇచ్చారని తెలిపారు. ఈ కనెక్షన్లు ప్రభుత్వ భూములో ఉన్నాయని రెవెన్యూ శాఖ సర్వే చేసి విద్యుత్ శాఖకి ఎండార్స్ మెంట్ పంపించారని ఈ కనెక్షన్లు రెండు తొలగించమని విద్యుత్ శాఖకు ఎండార్స్ మెంట్ పంపించినప్పటికీ విద్యుత్ శాఖ దీనిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

174 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక అభ్యుదయ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 174మందికి కంటి పరీక్షలు చేశారు. కంటి వైద్య శిబిరాన్ని అభ్యుదయ విద్యా సంస్థల అధినేత మర్రాపు కూర్మినాయుడు, ప్రిన్సిపాల్ చింతా శారదా ప్రారంభించారు. పట్టణం, పరిసర ప్రాంతాలు నుంచి హాజరైన 174మందికి వైద్య పరీక్షలు చేయగా 47మందికి శస్త్ర చికిత్స అవరమని వైద్యులు గుర్తించారు. వీరికి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయనున్నట్లు చెప్పారు. రోగులకు కంటి వైద్యులు సంధ్య వైద్య పరీక్షలు చేశారు.

ఆరి గంగయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆరి గంగయ్యకు ఎమ్మెల్యే బేబినాయన ఘనంగా నివాళులర్పించారు. ఆరి గంగయ్య జయంతి సందర్భంగా ఆరి గంగయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి గంగయ్య చేసిన కృషి మరువలేనిదని బేబినాయన అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్ బాబు, తెలగ సంక్షేమ సంఘం నాయకులు ప్రసాద్ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- వంగర

దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు అన్నారు. మండలంలోని బాగెంపేటలో ఈ నెల 24న అర్ధరాత్రి సుమారు 18 తులాలు బంగారం చోరీ జరిగిన ఇంటిని ఆయన ఆదివారం పరిశీలించారు. ఇంటి యజమానితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ సిఐ కె. అశోక్ కుమార్, వంగర ఎస్ఐ షేక్ శంకర్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

ప్రజాశక్తి- బొబ్బిలి

స్ఫూర్తి ప్రదాత మాజీ రాష్ట్రపతి, భారత్ రత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అని కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జె సి రాజు అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి నేపథ్యంలో కారుణ్య సంస్థ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జె సి రాజు మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా దేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక అభివృద్ధికి బాటలు వేసిన నిత్యా కృషీ వలుడు అబ్దుల్ కలాం అన్నారు.

పిల్లలకు 'వసతి' కష్టాలు

◆ నెల్లిమర్లలో తలుపులు లేని మరుగుదొడ్లు ◆ డెంకాడలో 69 మందికి ఒక్కటే మరుగుదొడ్డి ◆ అధ్వానంగా వసతి గృహాలు

డెంకాడ: 69 మంది వినియోగిస్తున్న మరుగుదొడ్డి ఇదే

వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. బిసి, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. నెల్లిమర్ల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మరుగుదొడ్లకు కనీసం తలుపులు లేవు. స్నానాలు గదులు లేక ఆరుబయటే స్నానాలు చేస్తూ అవస్థలు పడుతున్నారు. డెంకాడ మండలంలోని పెదతాడివాడ బిసి వసతిగృహంలో 69 మంది విద్యార్థులకు ఒక్కటే మరుగుదొడ్డి ఉండటం, గదులు ఇరుకుగా ఉండటంతో అవస్థలు పడుతున్నారు. కుక్కు కూడా లేకపోవడంతో వంటలు వారే చేసుకుని తినాల్సిన పరిస్థితి ఉంది. పైగా ఇక్కడ విద్యార్థులను అద్దె కొంప వేధిస్తోంది. ప్రభుత్వం స్పందించి వసతి గృహాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సాంఘీక సంక్షేమ వసతి గృహం సమస్యలు వలయంలో కొట్టు మిట్టాడుతోంది. విద్యార్థులు సౌకర్యాలు లేక ఆరుబయట స్నానాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. 32 మంది విద్యార్థులున్న ఎస్‌సి సంక్షేమ వసతి గృహంలో మరుగుదొడ్లకు తలుపులు కూడా లేకపోవడం గమనార్హం. గతంలో రామతీర్థంలో ఉండే ఈ సాంఘీక సంక్షేమ వసతి గృహాన్ని ఇక్కడకు తరలించి నిర్వహిస్తున్నారు. అయితే వసతి గృహాన్ని మార్చారు గాని సౌకార్యలు కల్పించడంలో విఫలమయ్యారు. ఇప్పుడున్న భవనం పాతది కావడంతో గదులు కారిపోతున్నాయి. ఈ గదుల్లోనే విద్యార్థులు కాలం వెళ్లబుచ్చుతున్నారు గాని విద్యార్థుల సమస్యలు పట్టించుకున్న నాధుడు కనిపించడం లేదు. ప్రస్తుతం వసతి గృహం మరమ్మత్తు పనులు చేపడుతున్నారు. కానీ అవి ఉమ్మి తడి పనులు మాత్రమేనని అక్కడ లీక్ అవుతున్న నీటిని చూస్తే తెలిసిపోతోంది. ప్రభుత్వాలు మారుతున్నా సాంఘీక సంక్షేమ వసతి గృహం సమస్యలు పరిష్కారం కావడం లేదు. వారి సమస్యలు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా అధికార్లు స్పందించి సాంఘీక సంక్షేమ వసతి గృహం సౌకర్యాలు కల్పించాలని తలిదండ్రులు కోరుతున్నారు.

నెల్లిమర్ల: తలుపులు లేని మరుగుదొడ్లు

మరుగుదొడ్లకు తలుపులేవి?

వసతి గృహంలో ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా అవి కూడా శిథిలావస్థకు చేరి పెచ్చులూడిపడిపోతున్నాయని ఎప్పుడు కూలిపోతాయోనన్న భయంతో ఉన్నామని విద్యార్థులు చెబుతున్నారు. పైగా స్నానాలు గదులు లేక ఆరుబయటే స్నానాలు చేస్తున్నామని నిత్యం పాములు తిరిగే ఈ ప్రాంతంలో ఆరబయట స్నానాలు ప్రమాదకరమని విద్యార్థులు తల్లి దండ్రులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని, తొలుత మరుగుదొడ్లకు తలుపులు వేయించాలని కోరుతున్నారు.

అద్దె భవనంలోనే వసతి గృహం

డెంకాడ: మండలంలోని ఏకైక వసతి గృహంగా గుర్తింపు పొందిన పెదతాడివాడ బిసి వసతి గృహం అద్దె కొంపలోనే నడుస్తోంది. ఈ వసతి గృహంలో ప్రస్తుతం 69 మంది విద్యార్థులు ఉండగా గత 40 ఏళ్లుగా అద్దె భవనంలోనే నడిపిస్తున్నారు. గతంలో విజయనగరం నాతవలస రోడ్డు పక్కన అద్దె భవనంలో ఉండేది. వసతి గృహం నుంచి పాఠశాలకు వెళ్లేందుక సుమారు కిలోమీటరు నడవడం, పైగా రోడ్డు దాటడంతో విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యేవారు. దీంతో రెండేళ్ల క్రితం పాఠశాలకు సమీపంలో తాడివాడలోని ఒక అద్దె ఇంటిలోకి వసతి గృహాన్ని మార్చారు. తొలి రోజుల్లో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాలకు కలిపి డెంకాడ మండలంలోనే ఒక్క వసతి గృహం ఉండేది. ఆ సందర్భంగా వసతి గృహంలో చేరేందుకు పెద్దఎత్తున జిల్లా స్థాయి నాయకులు, అధికారులు సీటు కోసం సిఫార్సు చేసేవారు. అలాంటి వసతి గృహం అద్దె కొంపలో ఉండటం, పాఠశాలకు దూరంగా ఉండటం, రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడటంతో విద్యార్థుల సంఖ్య సుమారు 200 నుంచి 15కు తగ్గిపోయింది. రెండేళ్ల క్రితం పాఠశాల దగ్గరికి వసతి గృహాన్ని మార్చిన తరువాత మళ్లీ విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరిగి ప్రస్తుతం 69 మంది చదువుతున్నారు. వీరికి కూడా ఇప్పుడున్న అద్దె భవనం చాలాక ఇబ్బంది పడుతున్నారు.

నెల్లిమర్ల: ఆరుబయటే స్నానాలు చేస్తున్న విద్యార్థులు

69 మందికి ఒక్కటే మరుగుదొడ్డి

వాస్తవానికి పాఠశాలకు సమీపంలో అద్దె భవనం తీసుకున్నప్పటికీ విద్యార్థులకు సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వసతి గృహంలో ఉన్న 69 మంది విద్యార్థులకు కేవలం ఒక్క మరుగుదొడ్డి ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్నానపు గదులు కూడా లేకపోవడంతో ఆరుయటే స్నానాలు చేస్తున్నారు. ఏళ్లుగా అద్దె కొంపల్లోనే నిర్వహిస్తున్న వసతి గృహానికి శాశ్వత భవనం నిర్మించాలని కోరుతున్నా అధికా రులు, ప్రజాప్రతి నిధులు పట్టించుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది. వైసిపి ప్రభుత్వంలో వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగకపో వడంతో పిల్లలు మళ్లీ అద్దె కొంపలోనే ఉంటున్నారు. వసతి గృహ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని మాత్రం కొంత మంది కబ్జా చేసినట్లు తెలిస్తోంది.

పిల్లలతోనే వంటా వార్పు

వసతి గృహంలో కుక్కు పోస్టు ఖాలీగా ఉండటంతో ఆ బాధ్యతను కూడా పిల్లలు మీదే పెట్టారు. పెద్ద తరగతులకు చెందిన విద్యార్థులు వంటలు చేయడం, కూరగాయలు కోయడం వంటి కార్య క్రమాలు చేసుకుంటున్నారు. విద్యార్థులకు కనీసం దుప్పట్లు, కాస్మోటిక్ ఛార్జీలు కానీ ఇవ్వడం లేదని చెబుతున్నారు. వసతిగృహం కూడా చాలకపోవడంతో ఇరుకు గదుల్లోనే ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు. వీరికి శాశ్వత భవనం మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి- బాడంగి

4 లేబర్ కోడ్‌లు రద్దుచేసి కార్మిక చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని సిఐటియు మండల మహాసభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ ఆఫీస్ ఆవరణంలో ఆదివారం సిఐటియు మండల కన్వీనర్ ఎ.సురేష్ ఆధ్వర్యంలో సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్లకు, కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చి కార్మిక హక్కు చట్టాలను కాల రాస్తుందన్నారు. కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి 10 గంటల పని చేయాలని నిబంధనలు తీసుకురావడం చట్ట విరుద్ధమన్నారు. మహిళలకు పరిశ్రమల్లో రాత్రిపూట పనికి వెళ్లాలని చెప్పడం మహిళా కార్మికులను తీవ్ర అన్యాయం చేయడం అన్నారు. ఇటువంటి చట్టాల వల్ల కార్మిక వర్గం తీవ్ర అన్యాయానికి గురవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకు వస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలకి వ్యతిరేకంగా భవిష్యత్తులో పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అన్యాయం చేస్తే సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను ఏకతాటిపైకి తీసుకువచ్చి పోరాటాలు ఉధతం చేస్తామన్నారు.

బాడంగి: సభలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

సిఐటియు నూతన కమిటీ ఎన్నిక

అనంతరం మండల సిఐటియు నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఏ.సురేష్, కో కన్వీనర్‌గా సిహెచ్ రమణమ్మ, శశికళ, కె.సింహాచలం, కమిటీ సభ్యులుగా సీత, శ్రీదేవి, నాగమణి, ఆదిలక్ష్మి, కళావతి, శ్రీదేవి, రామారావు, అప్పన్న ఎన్నికయ్యారు. ఈ సభలో అధిక సంఖ్యలో స్కీమ్ వర్కర్స్, కార్మికులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండల కేంద్రంలో సిఐటియు కార్యాలయంలో ఆదివారం జిల్లా వ్యవసాయ సంఘం కార్యదర్శి గాడి అప్పారావు అధ్యక్షతన మండల సిఐటియు రెండవ మహాసభ నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గంపై కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున దాడి చేస్తున్నాయన్నారు. పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు కోడ్‌లుగా మార్చేన్నారని, కార్మిక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. లేబర్ అధికారులు పర్యవేక్షణలో లేకపోవడం వల్ల పరిశ్రమల్లో కార్మికులకు భద్రత లేదని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని దానికి కారణం ప్రభుత్వ విధానాలే అని ఆమె అన్నారు. 2012 నుంచి కనీస వేతనాల సవరణ జరగలేద న్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటున్న బిజెపి ప్రభుత్వం, దాన్ని బలపరుస్తున్న ఎపిలో కూటమి ప్రభుత్వం ఒకే రకమైన పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పేదరిక నిర్మూలన, ధరలు తగ్గింపు, ఉపాధి కల్పనపై పాలకులు దృష్టి పెట్టాలన్నారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం 16 మందితో మండల కమిటీ నియామకం చేశారు. మండల కన్వీనర్‌గా గొల్ల దేవి, కో కన్వీనర్‌గా సిహెచ్ అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకు న్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జి కామేష్, ఏ.దేవి రాణి, మంగమ్మ, కే కుమారి, అప్పల నరస, పాల్గొన్నారు.

కల్వర్టు పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్ నుంచి థామస్ పేట మీదుగా జరజాపుపేట వెళ్లే రహదారి కల్వర్టు పూడిక పోయి మురుగు నీరు రోడ్డు పై ప్రవహించడంతో స్థానికులు, పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులుపై ప్రజాశక్తి కథనంతో సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు ఫిర్యాదు మేరకు నగర పంచాయతీ అధికార్లు, రహదార్లు, భవనాలు శాఖ అధికార్లు స్పందించారు. శనివారం నగర పంచాయతీ కమిషనర్ టి. జయరాం, రహదారులు, భవనాలు శాఖ జెఇ నందకుమార్ కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ జయరాం మాట్లాడుతూ కల్వర్టు తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టి మురుగు తొలగించడానికి పైప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. శాశ్వత పరిష్కారానికి రూ.8 లక్షల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. నిధులు మంజూరైనా వెంటనే పనులు ప్రారంభిస్తామని జెఇ నందకుమార్ తెలిపారు.

లెండిలో సిటిజన్ ఫోర్స్ కేన్సర్ క్లబ్

ప్రజాశక్తి- డెంకాడ

ఒక్కరి కోసం అందరు.. అందరి కోసం ఒక్కరు.. అనే స్ఫూర్తితో సిటిజెన్ ఫోర్స్ కేన్సర్ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఆవిష్కృతమైంది. కేన్సర్ చికిత్సకు సహాయమందించే లక్ష్యంతో రూపుదిద్దుకున్న సిటిజెన్ ఫోర్స్ కేన్సర్ క్లబ్ గురించి, స్థానిక లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. సిటిజెన్ ఫోర్స్ కేన్సర్ క్లబ్ ఉద్యమంలో లెండి కళాశాల విద్యార్థులు భాగస్వాములయ్యారు. ఈ సదస్సులో కళాశాల ఛైర్మన్ పి.మధుసూదనరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సహాయపడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. భావి భారత పౌరులుగా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్న విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవా లన్నారు. వికసిత్ భారత లక్ష్య సాధనలో విద్యార్థులదే కీలక భూమిక అని, విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం ద్వారా వికసిత భారత్ ఆవిష్కృతం అవుతుందని అన్నారు. సిటిజెన్ ఫోర్స్ కేన్సర్ క్లబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా కేన్సర్ వ్యాధిపై పోరాటంలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని కోరారు. సిటిజెన్ ఫోర్స్ ఫౌండేషన్ సిఎండి పి.రమేష్ బాబు మాట్లాడుతూ, మంచితనం, పరోపకారం మనుషులందరి సహజ లక్షణాలేనని, అయితే వేర్వేరు కారణాలతో ఆ లక్షణాలు మరుగునపడిపోతున్నాయని అన్నారు. ఎవరికి కష్టం వచ్చినా అందరూ అండగా ఉంటామనే సంకల్పంతో సిటిజెన్ ఫోర్స్ కేన్సర్ క్లబ్ పనిచేస్తుందని వెల్లడించారు.

హామీల అమల్లో కూటమి విఫలం

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎన్నికల హామీలు అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ఏడో వార్డులో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన కూటమికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, విస్సు పాల్గొన్నారు.

గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

వేపాడ: మండలంలోని వీలుపర్తి, వావిలపాడు, ఎస్‌కెఆర్ పురం, చిన్న గుడిపాల, నల్లబెల్లి గ్రామాల్లో ఆదివారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, నాయకులు నిరుజోగి వెంకట రావు, అడపా ఈశ్వరరావు, భోజంకి శ్రీను, ఆకుల సత్తిబాబు, నీరుజోగి శ్రీను, గోకాడ సత్యం నాయుడు, రావాడ వెంకటరావు, పచ్చికూర అప్పలనాయుడు, బీల సతీష్, గండి శ్రీరామమూర్తి, చిరంజీవి, ఈర్ల సన్యాసినాయుడు, భోజంకి రామునాయుడు, వేచలపు ఈశ్వరరావు, పెదనాయుడు, సిహెచ్. రమణ, వేచలపు రామూర్తి నాయుడు, బి.కృష్ణ, పాల్గొన్నారు.

గవర్నర్ పదవి ఉత్తరాంధ్రకు గర్వకారణం

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

పూసపాటి అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి దక్కడం ఉత్తరాంధ్రకి గర్వకారణమని ఎపి మార్క్ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. భోగాపురం మండలంలోని పోలిపల్లిలో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంలోనే కాదు అక్కడి నాయకులను ప్రోత్సహించడంలో కూడా టిడిపి ముందుంటుందన్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు వెనకబడిన ఉత్తరాంధ్ర నుంచి అశోక్ గజపతి రాజుకి గోవా గవర్నర్‌గా పదవి రావడం, కింజరపు రామ్మోహన్‌నాయుడుని కేంద్ర విమానాయాన మంత్రిని చేయడం, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడును ఎంపిగా చేయడం టిడిపికే సాధ్యమన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ పిడుగు తోటారావు, పార్లమెంటు తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, మౌళి వర్మ, కర్రోతు రామునాయుడు, మామిడి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: దేశ రాజకీయాల్లో ఉత్తరాంధ్రకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని బుడా ఛైర్మన్ తెంటు రాజా అన్నారు. బాడంగిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు చెందిన అశోక్ గజపతి రాజు, కింజరాపు ఎర్రంనాయుడు, కింజరాపు రామ్మోహనరావు కేంద్ర మంత్రులుగా పని చేశారని, అశోక్ గజపతిరాజుకు గోవా గవర్నర్'గా నియమించడం ఆనందంగా ఉందని ఇవన్నీ టిడిపితోనే సాధ్యమని చెప్పారు.

చీపురుపల్లి : చంద్రబాబు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని టిడిపి జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం చీపురుపల్లిలో ఉన్న ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రాంత వాసుల రాజకీయ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నార న్నారు. కింజరాపు అచ్చంనాయుడు, రామ్మోహన్ నాయుడు లాంటి నాయకులకు తగిన ప్రాధా న్యతను ఇచ్చి కేంద్ర స్థాయిలో పదవులను ఇచ్చార న్నారు. విశాఖపట్నం పల్లా శ్రీనివాసరావుకి టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడంతో పాటు నాలుగు దశాబ్దాలుగా నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన అశోక్ గజపతిరాజు లాంటి నాయకులకు గవర్నర్ పదవి ఇచ్చి గుర్తింపు ఇచ్చారన్నారు.

గ్రామాల్లో ఆకలి కేకలు..

- పనులు చేసినా అందని బిల్లులు
- ఆరు వారాలుగా చేతికందని వేతనాలు
- అవస్థలు పడుతున్న కూలీలు

ప్రజాశక్తి- మెంటాడ

ఉన్నచోట పనులు కల్పించి వలసలు నివారించాలని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చింది. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పిస్తూ దారిద్ర్య రేఖకు దిగువనున్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని ఉద్దేశంతో ప్రవేశపెట్టిన చట్టం నిధులు సక్రమంగా విడుదల కాక నిర్వీర్యం దిశగా అడుగులు వేస్తోంది. రెండు పూటలు పనిచేసినా వేతనాలు సకాలంలో రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు వారాలుగా వేతనాలు అందక పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబానికి 100 రోజులు పని దినాలు సరిపోవటం లేదని, కనీసం 200 రోజుల పని దినాలు కల్పించాలని, దినసరి వేతనం 600 రూపాయలు చెల్లించాలని వామపక్ష నేతలు ధర్నాలు, నిరసనలు చేసినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం చేస్తున్నాయి. పెరుగుతున్న నిత్యవసరాల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉపాధి వేతనదారులు ఆందోళన చేసినప్పటికీ పట్టించుకునే దాఖలాలు లేవు.

చేసిన పనికి సకాలంలో బిల్లులు లేవు..

మండలంలో 11వేల జాబ్ కార్డులు ఉండగా ఈ ఏడాది 8600 కుటుంబాలు మాత్రమే ఉపాధి పనులు చేశారు. ఫారంపండ్ 280 పనులు, 310 చెరువుల పూడికతీతలు, కాలువల పనులు చేశారు.

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ప్రభుత్వం కల్పించిన వంద రోజులు పని దినాలు వేతన దారులు పూర్తి చేసినప్పటికీ సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఉపాధి వేతనదారులు ఇబ్బందులు వర్ణాతీతం. రెక్కాడితేగాని డొక్కడాని పరిస్థితిలో ఉన్న నిరుపేదలో ఎక్కువ ఉపాధి హామీలో పనిచేస్తున్నారు. అటువంటి వారికి ఆరు వారాలుగా వేతనాలు ఇవ్వకపోతే పూట ఎలా గడుస్తోందని ప్రశ్నిస్తున్నారు.

మా ఇబ్బందులు తీర్చండి

11 వారాలు పనిచేశాం. ఆరు వారాల బిల్లులు పడ్డాయి. మిగతా ఐదు వారాల డబ్బులు పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. బిల్లులు పడతాయా లేదా అని చాలా కాలంగా ఎదురుచూస్తున్నాం.

- కునుకు కృష్ణవేణి, ఉపాధి కూలీ, మెంటాడ

బిల్లులు రాక పస్తులు ఉంటున్నాం

ఉపాధి బిల్లులు జాప్యం కావడంతో ఇంటిల్లపాది పస్తులు ఉంటున్నాం. ఖరీఫ్ కూడా ప్రారంభం కావడంతో మదుపులు కూడా డబ్బులు చాలక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో ఆరు వారాల బిల్లులు మాకు చెల్లిస్తే కాస్త ఉపశమనం కలుగుతోంది. బిల్లులు రావడానికి చర్యలు చేపట్టాలి.

పాండ్రంకి అప్పారావు (అబ్బులు), మెంటాడ.

బిల్లులు చెల్లించే వరకూ పోరాడుతాం

పెండింగ్‌లో ఉన్న ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలి. ఆరు ఏడు వారాలు బిల్లులు ఇవ్వకపోతే కూలీల జీవనం కష్టమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను కూలీల ఖాతాల్లో వేయాలి. లేనియెడల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తాం.

రాకోటి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి,

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE-CUM-JUDGE FAMILY COURT AT VIZIANAGARAM
E.A 31/2025 :: E.P. 42/2018
O.S. 07/2011

Between :
Sarika Suryanarayana
...Petitioner/Decree Holder
AND:
Bandaru Demudu and Others
...Respondents/Judgment Debtors
To,
R-11) Smt PATURU KRISHNAMMA W/o Venkata Rao, aged about 50 years Cultivation, KORUKONDA VILLAGE VIZIANAGARAM MANDAL & DISTRICT.
R-13) Smt SIRIPURAPU SANYASAMMA W/o Late Appala Swamy, aged about 45 years Cultivation, KORUKONDA VILLAGE VIZIANAGARAM MANDAL & DISTRICT

Whereas the above named petitioner/D.Hr has instituted the above E.A. 31/2025 in E.P. 42/2018 in O.S. 07/2011 against you to receive the draft sale deed for execution of Registered Sale Deed in terms of Decree passed by the Honourable Court in the above suit. Therefore you are hereby summoned to appear in this Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the E.A. 31/2025 who shall be able to answer all such questions on the **30th Day of JULY, 2025, at 10-30 A.M.** to answer the claim.

By Order of the Honourable Court
I. RAMESH, ADVOCATE
Vizianagaram **K.L.PURAM,**
Dt. 20-07-2025 **VIZIANAGARAM**

ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ జిల్లా జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు
G.W.O.P.No. 8/2025

Between:
1. నాగళ్ళ నాని (మైనర్) ......పిటిషనరు
2. నాగళ్ళ @ వెన్నెల పుష్పలత ....పిటిషనరు

And :
3. నాగళ్ళ వెంకటరాజు @ వెంకటరమణ ..రెస్పాండెంట్

పై నెంబరు G.W.O.P. 8/25 పిటిషన్‌లో, పిటిషనరైన నాగళ్ళ నాని (మైనరైనందున అతని అక్కైన నాగళ్ళ @ వెన్నెల పుష్పలత గార్డియన్ ఆయియున్నారు. వీరిద్దరి తల్లిగారైన నాగళ్ళ లక్ష్మి మరణానంతరం Class-1 Legal Heriగా అయియున్నారు. వీరికి విజయనగరం జిల్లా, తెర్లాం మండలం, సతివాడ గ్రామంలో పిటిషన్ దాఖల ఆస్తి కలదు. సదరు ఆస్తిపై అమ్మేటకు గార్డియన్‌గా ఇందలి రెండవ పిటిషనరు అయిన నాగళ్ళ @ వెన్నెల పుష్పలతను గార్డియన్‌గా నియమించమని కోరుచు పై పిటిషను విజయనగరం జిల్లా కోర్టులో దాఖలు చేసినందున అందుకు ఇతరువెవ్వరికైన ఎవ్విధమైన ఆటంక, అవరోధములు, ఆక్షేపణలు యున్న ఎడల పై కోర్టులో **తే 4-8-2025దిని ఉదయం 10-30 నుండి సాయంత్రం 5.00 గంటల** మధ్య ఖుద్దున గాని, వకీలు గారి ద్వారా గాని తెలియపర్చుకోగలరు. లేనియెడల పిటిషనరు తరపున తీర్పు వెలువరిచెందరని యావన్మందికి ఇందుమూలంగా తెలియజేయడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//
Challarapu Satyanarayana
Palla Ravi
Advocates, Vizianagaram